రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం

చింతలపూడిలో
వాహనచోదకులకు ఇబ్బందులు


స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద సంచరిస్తున్న పశువులు


పాత బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిచిన పశువులు

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలో పశువుల బెడద ఎక్కువైంది. పశువులు రోడ్డుపై యథేచ్ఛగా సంచరిస్తూ వాహనచోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి. స్థానిక పాత బస్టాండ్, బోసుబొమ్మ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్లలో మెయిన్ రోడ్డుపై పశువుల సంచారం వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. 24 గంటలూ రోడ్డుపైనే పశువులు నివాసం ఉంటున్నాయి. ఈ పశువులు ఎవరివో, ఎక్కడి నుంచి వచ్చాయో ఎవరికీ తెలియని పరిస్థితి. ఒక్కోసారి ఇవి ఒకదానిపై మరొకటి కలబడినప్పుడు ఎవరిపై పడతాయో తెలియక వాహనచోదకులు, పాద చారులు హడలిపోతున్నారు. ఆహారం కోసం పశువులు దుకాణాల వద్ద కూరగాయలను అరగిస్తున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో పశువులు యజమానుల ఇళ్లకెళ్లకుండా రోడ్లపైనే పడుకుని సేద తీరుతున్నాయి. ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ, వర్షానికి తడుస్తూ అనారోగ్యం బారిన పడి కొన్ని పశువులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు లేకపోలేదు. మరికొన్ని వాహనాల క్రింద పడి గాయాల పాలై మృతి చెందుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. గతంలో స్థానిక పోలీసులు పశువుల బెడద నుంచి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి స్థానిక పంచాయతీ అధికారుల సహకారంతో ఇతర ప్రాంతాలకు తరలించి వాటి యజమానులకు సమాచారం అందించడంతో కొంతకాలం రహదారులపై పశువులు కనిపించలేదు. ఇటీవల వీటి బెడద ఎక్కువైంది. అధికారులు చొరవచూపి యజమానులకు నోటీసులు జారీ చేసి, సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



పట్టణంలో మూగ జీవాలు ఎక్కడ పడితే అక్కడ సంచరిస్తున్నాయి. వాటికి ఆహారం, కనీసం సేద తీరడానికి స్థలం లేక రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నాయి. పశువుల యజమానులు రోడ్లపై మూగజీవాలు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నగర పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– తొర్లపాటి బాబు, సీపీఐ మండల కార్యదర్శి

అంబరాన్నంటిన ఆదివాసీ సంబరాలు


బుట్టాయగూడెం : అరుణోదయ కళాకారుల డప్పు నృత్యం


పోలవరం రూరల్ : రామన్నపాలెంలో మాట్లాడుతున్న నాయకులు


కుక్కునూరు : ఆదివాసీ జెండాను ఎగరవేస్తున్న నాయకులు

- వాడవాడలా వేడుకలు
- ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద శనివారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, గిరిజన మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ రకాల స్టాల్స్‌తో ఐటీడీఏ పరేడ్ గ్రౌండ్స్‌లో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జెడ్పీ చైర్పర్సన్ గంటా పద్మశ్రీ, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఐసీడీఎస్ పీడీ పి.శారద, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్ ఉయికే బొజ్జి, తదితరులు పాల్గొన్నారు. బుట్టాయగూడెంలో జాతీయ ఆదివాసీ ఐక్యవేదిక, ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐక్యవేదిక ప్రతినిధులు గుండి బుచ్చిరాజు, మడివి కామరాజు, కోర్స చిన్నరాజులు, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణిలు పాల్గొన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. అరుణోదయ కళాకారులు డప్పు నృత్యాలతో భారీ ర్యాలీ చేశారు. ధర్ముల సురేష్, కారం రాఘవ, సరియం రామ్మోహన్‌రావు, పోరండ్ల శ్రీనివాస్, వెట్టి సుబ్బన్న, న్యాయవాది యు. ఏసుబాబు, తగరం బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. ఏకలవ్య పాఠశాలలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

పోలవరం రూరల్ : ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా నాయకులు కలుం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రగడపల్లి పంచాయతీ రామన్నపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సభలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ హక్కులు సాధించిన రోజే మనకు నిజమైన పండుగని అన్నారు. 1/70 చట్టం, పీసా, అటవీ హక్కుల చట్టాలకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు, నవ యువ సమైక్య రాష్ట్ర నాయకులు ఎస్ మోహన్, మిడియం రవి దొర, నాయకులు, కొమరం రామారావు, వలస పేద గౌరి మాట్లాడారు. గిరిజన సాంప్రదాయ డప్పు, డాన్సులు, పాటలు ఆకట్టుకున్నాయి.

సంస్కృతి, సాంప్రదాయలను కాపాడాలి

పోలవరం మండలం కోండ్రుకోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఐటీడీఎస్ స్వచ్ఛంగా సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద ఆదివాసి జెండాను ఎగురవేశారు. సేవా సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయలను, చట్టాలను కాపాడాలన్నారు. ఆదివాసి జేఏసీ నాయకులు సరియం వెంకటేష్, గిరిజన జ్యోతి ప్రెసిడెంట్ కూరం సత్యనారాయణ దొర, సర్పంచ్ పైదా నాగరాజు, పీసా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: చట్టాల అమలుతోనే ఆదివాసీలకు భద్రత చేకూరుతుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూరం సంజీవరావు అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కుక్కునూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ కళాకారుల నిర్వహించిన నృత్యాలతో ర్యాలీ ఆకట్టుకుంది. ఆదివాసీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి కుంజా శ్రీను ఆదివాసీ పతాకాన్ని ఎగరవేశారు. ఏఎస్‌పీ నాయకులు కూరం సంజీవరావు, వేణుగోపాల్, ఏటీఏ జిల్లా నాయకులు పురెం సీతారామయ్య, సోడే వెంకటనారాయణ, బానారి బాలకృష్ణ, కొలూరి లక్ష్మి, ఏఎస్‌పీ మండల అధ్యక్షులు సరియం ప్రసాద్, పైదా పరమేశ్వరావు, సర్పంచులు పాయం సత్యనారాయణ, కంటిపల్లి రామకృష్ణ, మడకం వెంకటేష్, కుంజా భద్రం తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి


వేలేరుపాడు : ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం


వేలేరుపాడు: ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కారం దారయ్య, పిట్టా ప్రసాద్, పిట్టా వీరయ్య, బంధం అర్జున్, కరటం వెంకటేశ్వర్లు, బంధం నాగేశ్వరావు, మడివి కామయ్య, కంగారు గంగరాజు, మచ్చ చంద్రరావు, తెల్ల మహేష్, మడకం విజయ్, సోడే ప్రసాద్, గడుపుల భీమరాజు, కారం కుమారి, బంధం రమాదేవి, పిట్టా జయ పాల్గొన్నారు. జీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మిర్యాల శ్రీనివాసరావు, పైదా రమేష్, బంధం ప్రసాద్‌లు పాల్గొన్నారు.

చవితికి సిద్ధమైన గణనాథులు

జంగారెడ్డిగూడెం: గణపతి నవరాత్రులకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమయ్యాయి. వివిధ ఆకృతుల్లో గణనాథుల విగ్రహాలను రూపకర్తలు సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీల అభిరుచులకు అనుగుణంగా వివిధ సైజుల్లో బొజ్జగణపయ్య రూపాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా విగ్రహాల కూర్పు, సైజును బట్టి ఒక్కొక్క విగ్రహానికి ఒక్కొక్క రేటును విక్రయదారులు నిర్ణయించారు. ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో గణపతి ప్రతిమను ప్రతిష్ఠించి వైభవంగా నవరాత్రులు నిర్వహించనున్నారు. మూడు రోజుల నుంచి 9 రోజులకు వరకు ఆయా కమిటీల సన్నద్ధతను బట్టి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సైజు, మోడల్‌ను బట్టి ఒక్కొక్క విగ్రహం రూ. 5వేల నుంచి రూ.25వేల వరకు అమ్ముతున్నారు. విజయవాడ, హైదరాబాద్, నున్న, స్థానికంగా తయారు చేసిన విగ్రహాలను జంగారెడ్డిగూడెం హైస్కూల్ సెంటర్ వద్ద, జేపీ సెంటర్, బైపాస్ రోడ్డులో విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.


పంచముఖ ఆంజనేయ సమేత వినాయకుడు


గంధర్వులతో గణపతి


శివకేశవుల సమేత వినాయకుడు


రథంపై గణనాథుడు


శివపార్వతుల సమేత వినాయకుడు


సమర వినాయక, వెనుక చత్రపతి శివాజీ

శాస్త్రోక్తంగా చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రావణమాసం పౌర్ణమి తిథిని పురస్కరించుకుని నూకాలమ్మ ఆలయంలో 78వ చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చండీ హోమంలో ఉభయదారులుగా పాల్గొన్న దంపతులకు అమ్మవారి శేష వస్త్రాలు, అమ్మ వారి చిత్రపటాలు ఇచ్చి వేద అశీర్వాదాలతో ఘనంగా సత్కరించామని ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధాంతి చావా రమేష్ బాబు, పీవీ కృష్ణారావు తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రొంగల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిజాతగిరిలో పూజలు


పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకుడు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి అమ్మవారి శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. గిరి ప్రదక్షిన చేసిన భక్తులు ప్రత్యేక దర్శనం, ప్రసాదం పంపిణీ చేశామని ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. అప్పలరాజుగూడెం చెందిన నాదెళ్ల రాయుడు, ఆయన కుటుంబ సభ్యుల సాయంతో అన్నదానం చేశామని పేర్కొన్నారు. శనివారం వివిధ సేవల రూపేణా ఆలయానికి రూ.1,50551 ఆదాయం వచ్చిందన్నారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


దాత రామకృష్ణంరాజుకు విరాళం బాండ్ అందిస్తున్న కిషోర్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన మంతెన రామకృష్ణంరాజు శనివారం రూ.1,00,116 విరాళంగా అందించారని ఆలయ సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ తెలిపారు. దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించామని, తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని పేర్కొన్నారు.

ప్రతి ఆదివారం హనుమద్ హోమం


మద్ది ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ప్రతి ఆదివారం హనుమద్ హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ ఆర్‌వీ చందన శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హనుమద్ హోమం ఉంటుందని, పాల్గొన్న దంపతులకు వీఐపీ దర్శనం, వేదాశీర్వాదం కల్పిస్తున్నామని వివరించారు. మద్ది ఆంజనేయస్వామికి శనివారం సందర్భంగా అభిషేక సేవ చేసినట్టు చెప్పారు. వివిధ సేవలు, విరాళాల ద్వారా ఆలయానికి రూ.1,41,469 ఆదాయం సమకూరిందన్నారు.

గజ్జ పూజ


గజ్జ పూజ చేస్తున్న సభ్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో ఏలూరుకు చెందిన విష్ణు భజన మండలి సభ్యులు శనివారం గజ్జ పూజ నిర్వహించారు. సుమారు 30 మంది మహిళలు, బాలికలు మండపంలో కూర్చుని గజ్జలకు పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ఆలయ ఆవరణలో తొలి కోలాట నృత్యాలు చేశారు. ఇవి భక్తులను అలరించాయి.

రక్తదానం


రక్తదానం చేస్తున్న అభిమానులు

జంగారెడ్డిగూడెం: సినీ నటుడు మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలను మురళీకృష్ణ మహేష్ యువసేన అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో అభిమానులు రక్తదానం చేశారు. అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. అధ్యక్షుడు బవిరిశెట్టి మురళీకృష్ణ, మహేష్ యువసేన సభ్యులు పవన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

దెందులూరు: ఏలూరు ఆసుపత్రి వద్ద ద్విచక్ర వాహనం శుక్రవారం అపహరణకు గురైంది. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాంతానికి చెందిన అమరపు చినబాబు తన కుమారుడిని తీసుకుని నగర పరిధిలో ఓ ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చి ఆసుపత్రి బయట తన వాహనాన్ని పార్క్ చేసి లోనికి వెళ్లి వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

చింతలపూడి : స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ చింతలపూడి పట్టణ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు (నాగు) తెలిపారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ముఖ్య అతిథులుగా పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జయప్రకాష్, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌లు హాజరవుతారని వివరించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులంతా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కూలిన వృక్షాలతో ట్రాఫిక్ జామ్


రోడ్డుపై కూలిన భారీ వృక్షాలు, నిలిచిన ట్రాఫిక్

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం సమీపంలో భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో ఏలూరు – చింతలపూడి రోడ్డుపై ట్రాఫిక్ జామైంది. శనివారం కురిసిన గాలివానకు రోడ్డు వెంబడి ఉన్న 8 భారీ వృక్షాలు నేలకొరిగాయి. రహదారిపై వాహనాలు బారులు తీరాయి. స్థానికులు ట్రాక్టర్ల సాయంతో చెట్లను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, చెట్లు కూలిన ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

తడికలపూడిలో ఉచిత వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కామవరపుకోట: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ ఆధ్వర్యంలో మద్రి సుధాకర్, అలివేలు మంగ కుమారి ఆర్థిక సాయంతో ఆశ్రం హాస్పిటల్ వారిచే తడికలపూడి శివాలయం ప్రాంగణంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈసీజీ, ఎక్సరే, అల్ట్రా సౌండ్ స్కానింగ్, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేసి 165 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మానవతా శాఖ అధ్యక్షులు పావులూరి చంద్రలాల్ గాంధీ, జిల్లా ప్రెసిడెంట్ కందేపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాఖీ కట్టిన మాజీ మంత్రి వనిత


ద్వారకాతిరుమల : ఉమామహేశ్వర రావుకు రాఖీ కడుతున్న మాజీ మంత్రి

ద్వారకాతిరుమల: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత ద్వారకాతిరుమలకు చెందిన ఆ పార్టీ నాయకుడు పానమాల ఉమామహేశ్వరరావుకు శనివారం రాఖీ కట్టారు. ఉదయం తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసానికి వెళ్లిన ఉమామహేశ్వరరావుకు ఆమె రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు రాఖీ కట్టిన సోదరీమణులు


బాలరాజుకు రాఖీ కడుతున్న సోదరీమణులు

బుట్టాయగూడెం: రాఖీ పౌర్ణమి సందర్భంగా బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు తన ఇంటిలో ఆయన సోదరీలు శనివారం రాఖీ కట్టి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలోని సోదర సోదరీమణులకు ఆయన రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.